


పీహెచ్‌సీలో సౌకర్యాలు కరువు
- వసతులు లేక సిబ్బంది, రోగుల ఇబ్బందులు 6

పోకిరీల బెడద
కళాశాలలు, బస్టాండ్‌లే ప్రధాన అడ్డాలు 4



రుణమాఫీపై అన్నదాతల హర్షం

- ఏక కాలంలో రూ.2 లక్షల మాఫీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- జిల్లాలో 61,234 మంది రైతులకు లబ్ధి
- గత ఆర్థిక సంవత్సరంలో రూ.702.36 కోట్ల వ్యవసాయ రుణాలు
- త్వరలో మార్గదర్శకాల జారీ

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఎన్నికల హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రుణమాఫీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో జిల్లాలోని రైతుల్లో ఆనందాన్ని నింపింది. జిల్లా వ్యాప్తంగా రైతులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్నారు. రుణమాఫీకి సంబంధించి 2018 డిసెంబరు 12వ తేదీ నుంచి 2023 డిసెంబరు 9 వరకు కటాఫ్ తేదీగా నిర్ణయించారు. రూ.2లక్షల లోపు పంట రుణాలను ఆగస్టు 15లోగా మాఫీ చేస్తామని ప్రకటించినట్లుగానే ప్రభుత్వం ఒకే విడతలో రూ.2 లక్షలు మాఫీ చేస్తూ మంత్రి వర్గం తీర్మాణం చేయడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఇప్పటికే బ్యాంక్ అధికారులు వివరాలను ప్రభుత్వానికి అందించారు.

● జిల్లాలో 61,234 మంది రైతులకు లబ్ధి

తెలంగాణ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేయడాన్ని ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. రుణమాఫీ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలో 61,234 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 702.36 కోట్ల వ్యవసాయ రుణాలను పొందారు. రుణమాఫీపై ఇప్పటికే బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి పెట్టి ప్రభుత్వానికి లెక్కలను అందించారు. త్వరలో మార్గదర్శకాలు వెలవడనున్నాయి. మార్గదర్శకాలపై మాత్రం రైతుల్లో ఉత్కంఠత నెలకొంది. ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లింపుదారులు మాఫీకి అనర్హులనే ప్రచారం జరుగుతోంది. దీనిపై ఆ వర్గాల్లో కొంత ఆందోళన నెలకొంది. ఒక కుటుంబంలో ఐదుగురు పేరిట రూ. లక్ష రుణం పొందితే రూ.5 లక్షల వరకు రుణం అవుతుంది. కానీ రూ.2 లక్షల వరకే రుణ పరిమితి ఉంటుందని రేషన్ కార్డును కూడా అనుసంధానం చేయాల్సి ఉంటుందనే చర్చ సాగుతోంది. కుటుంబాన్ని ప్రామాణికంగా తీసుకుంటారా? లేదా? అనే విషయంపై మాత్రం ఉత్కంఠ నెలకొంది.

● గత ప్రభుత్వ హయాంలో నాలుగు విడతలుగా..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష లోపు రుణమాఫీ హామీ ఇచ్చి నాలుగు విడతలుగా మాఫీ ప్రక్రియ చేపట్టింది. 2014 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2018 డిసెంబరు 11వ తేదీ వరకు రుణం తీసుకున్న వారికి వర్తింపజేసింది. తొలి విడతలో రూ.25వేల లోపు ఉన్నవారికి, రెండో విడత రూ.50 వేల లోపు, మూడో విడత రూ.50 నుంచి లక్షలోపు ఉన్నవారికి మాఫీ చేసినా పెద్దగా ప్రయోజనం చేకూరలేదని, రైతుల వడ్డీకే సరిపోయిందనే విమర్శలు వచ్చాయి. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో 61,773 మంది రైతులు లక్ష రుణమాఫీకి అర్హులుగా ప్రకటించి మాఫీ చేసింది.

అభినందనీయం



- పాశం రాంరెడ్డి, రైతు పెద్దలింగాపూర్, ఇల్లంతకుంట

రైతుల రుణాలు మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయం. రూ.2 లక్షల వరకు రుణం ఒకేసారి మాఫీ చేయాలని మంత్రివర్గం తీర్మానించడంతో రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అర్థం అవుతుంది. నాకు రూ.1.18 లక్షల వరకు మాఫీ అవుతుంది. రుణాలు మాఫీ అయిన తర్వాత మళ్లీ ఇవ్వాలి.

ప్రభుత్వానికి రుణ పడి ఉంటాం



- ఒగ్గు కుంటయ్య, రైతు, తంగళ్లపల్లి

రెండు లక్షల రుణ మాఫీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. నాకు ఏడు ఎకరాల పొలం ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్ష రుపాయల రుణం మాఫీ అయ్యింది. ఇప్పుడు రెట్టింపు రుణం మాఫీ అవుతుండడం సంతోషంగా ఉంది. ప్రకటనలకే పరిమితం కాకుండా త్వరగా మాఫీ చేస్తే బాగుంటుంది.

వచ్చినప్పుడే లెక్క



- నూకల బాలరాజు, రైతు ఎల్లారెడ్డిపేట

రెండేళ్ల కిందట నేను రూ.50 వేలు, నా కొడుకు సాయికిరణ్ రూ.40 వేలు బ్యాంకులో పంట రుణం తీసుకున్నాం. గత ప్రభుత్వం రుణ మాఫీ చేస్తానని చేయకపోవడంతో వడ్డీ కట్టాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల రూ.2 లక్షల రుణమాఫీని ఏకకాలంలో చేస్తామని ప్రకటించింది. రుణమాఫీ డబ్బులు మా ఖాతాల్లో జమ అయినప్పుడే లెక్క.

డబ్బులు చెల్లించినవారికి వర్తింపజేయాలి



- శ్రీనివాస్, రైతు ఎల్లారెడ్డిపేట

2018లో రూ.లక్ష పంట రుణం తీసుకున్నా. గత ప్రభుత్వం మాఫీ చేయలేదు. బ్యాంకు అధికారులు చెల్లించాలని ఒత్తిడి తీసుకొచ్చారు. నా అకౌంట్‌లోని సొంత డబ్బుల్లో రూ.30 వేలను మిత్తి కింద తీసుకున్నారు. అకౌంట్‌ను ఫ్రీజ్ చేశారు. గత్యంతరం లేక రుణం డబ్బులు చెల్లించా. డబ్బులు చెల్లించిన మాకు కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ వర్తింపజేయాలి.

సంతోషంగా ఉంది



- ఎర్రం రాజలింగం, రైతు, రుద్రంగి.

ఎకకాలంలో రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పడం చాలా సంతోషంగా ఉంది. ఒకే సారి రెండు లక్షలు మాఫీ అవుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి తీసుకున్న రుణమాఫీ నిర్ణయం నాతోపాటు ఎన్నో నిరుపేద రైతు కుటుంబాలకు వరంగా మారుతుంది.

రాజన్నను దర్శించుకున్న హైకోర్టు జడ్జి



రాజన్న చిత్రపటం అందజేస్తున్న ఈవో

వేములవాడ టౌన్, జూన్ 23 : వేములవాడ రాజరాజేశ్వరస్వామిని హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నందా ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానికి వచ్చిన జడ్జికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కోడె మొక్కు చెల్లించుకొని స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయ అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ ఈవో రామకృష్ణ రాజన్న ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. అంతకుముందు శనివారం రాత్రి వేములవాడకు చేరుకున్న జడ్జికి జిల్లా జడ్జి ప్రేమలత, ఆర్డీవో రాజేశ్వర్, డీఎస్పీ నాగేంద్రచారి పూలమొక్కలను అందజేసి స్వాగతం పలికారు. పోలీసుల గౌరవవందనం స్వీరించారు. ఆలయ ప్రోటోకాల్ సూపరిండెంట్ సిరిగిరి శ్రీరాములు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

తంగళ్లపల్లి, జూన్23: తంగళ్లపల్లి జడ్పీహెచ్ పాఠశాల 1994 -95 పదోతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో బండి లక్ష్మణ్ గౌడ్, జలగం ప్రవీణ్, ఇటుకల అశోక్, ముక్క వాసు, రజిత, శారద, నాగరాణి, విష్ణు, పెద్దూరు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

1983-84 బ్యాచ్ విద్యార్థుల..

తంగళ్లపల్లి జడ్పీహెచ్ పాఠశాల1983-84 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పండుగ వాతావరణంలో జరుపుకున్నారు. 40 సంవత్సరాలకు ఒక్క చోట చేరి చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురిని సన్మానించారు.

ప్రతాప రామకృష్ణకు బండి సంజయ్ పరామర్శ



బండి సంయ్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ టౌన్, జూన్ 23 : బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదివారం పరామర్శించారు. గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స చేయించుకొని హైదరాబాద్‌లోని నివాసంలో ఉంటున్న రామకృష్ణను బండి సంజయ్ కుమార్ కలిశారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్ర మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్‌కుమార్‌కు రామకృష్ణ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎల్లారెడ్డిపేట, జూన్ 23: ఎల్లారెడ్డిపేట 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పృథ్వీదర్ ఆదివారం ప్రకటనలో తెలి పారు. సబ్ స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతు పనులు నేపథ్యంలో ఉదయం 9 గంటల నుం చి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎల్లారెడ్డిపేటలో వర్షం



పాతబస్టాండ్‌లో నిలిచిన నీరు

ఎల్లారెడ్డిపేట, జూన్ 23: ఎల్లారెడ్డిపేట మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు అర గంటపాటు ఎడతెరపి లేకుండా వాన పడింది. మండల కేంద్రంతో పాటు బొప్పాపూర్, గొల్లపల్లి, నారాయణపూర్, పదిర, హరిదాస్‌నగర్, గుండారం గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు వరద నీటితో నిండిపోయాయి. రహదారులపై వరద ప్రవహించింది. పత్తి రైతుల్లో ఆనందం నెలకొంది. భారీ వర్షం కురవడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. కురిసిన వర్షం పత్తి విత్తనాలకు జీవం పోసినట్లయ్యిందని పేర్కొంటున్నారు.

చొప్పదండి ఎమ్మెల్యేకు పరామర్శ

చందుర్తి, జూన్ 23 : చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను చందుర్తి జడ్పీటీసీ నాగం కుమార్ ఆదివారం హైదరాబాద్‌లో పరామర్శించారు. ఎమ్మెల్యే సత్యం సతీమణి రూపాదేవి ఇటీవల ఆత్మహత్య చేసుకున్నారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. చందుర్తి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంతపురి బాలకృష్ణ ఉన్నారు.

కుక్కల దాడిలో మనుబోతు మృతి

కోనరావుపేట, జూన్ 23 : కోనరావుపేట మండలం శివంగాలపల్లి అటవీ శివారు ప్రాంతంలో వీధి కుక్కలు మనుబోతు వెంటపడి దాడి చేయడంతో మృతి చెందింది. స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. డీఆర్‌వో బాపురాజు, బీట్ ఆఫీసర్ లావణ్య సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పశు వైద్యాధికారి పర్యవేక్షణలో పంచనామా నిర్వహించారు. అనంతరం మనుబోతు కళేబరాన్ని ఖననం చేశారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం లైన్‌లో బారులుదీరిన భక్తులు



బద్దిపోచమ్మ ఆలయంలో నిరీక్షిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, జూన్ 23: వేములవాడ రాజన్న ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి తరలివచ్చిన భక్తులు ముందుగా కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించి కోడెమొక్కు చెల్లించుకున్నారు. పార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో కుంకుమపూజలో పాల్గొన్నారు. ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ప్రతాపనవీన్, సూపరింటెండెంట్లు సిరిగిరి శ్రీరాములు, తిరుపతిరావు, అశోక్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బోనాలతో భక్తుల నిరీక్షణ

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారికి మెక్కులు చెల్లించుకునేందుకు గంటల తరబడి క్యూలైన్‌లో బోనాలతో నిరీక్షించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనబంధ ఆలయమైన వేణుగోపాల స్వామి ఆలయంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సం సందర్భంగా ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధ్యాపకులు

పాలిటెక్నిక్ ప్రవేశాల ప్రక్రియ కీలకం

వేములవాడ టౌన్, జూన్ 23:పాలిటెక్నిక్ మొదటి దశ ప్రవేశాల ప్రక్రియ కీలకమని, అభ్యర్థులు వీలైనన్ని ఎక్కువ ఆప్షన్లు ఇవ్వాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజగోపాల్ విద్యార్థులకు సూచించారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలో ఆదివారం పాలిసెట్ అభ్యర్థుల కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాలిసెట్ వెబ్‌సైట్‌ను సందర్శిస్తే గతేడాది కటాఫ్ వివరాలు లభిస్తాయన్నారు. కేటగిరి, కోర్సు ఆధారంగా వెబ్ ఆప్షన్‌లను నమోదు చేసుకోవాలన్నారు.

అంజన్న సన్నిధిలో కలెక్టర్



ప్రత్యేక పూజల్లో కలెక్టర్

మల్యాల, జూన్ 23: కొండగట్టు ఆంజనేయ స్వామిని ఆదివారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఏఈవో వైరాగ్యం అంజయ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా తీర్చిదిద్దాలి

- రాజన్న ఆలయాభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలి
- భక్తులు సులువుగా దర్శనం చేసుకునేందుకు చర్యలు
- సమీక్షలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వసతి గదుల నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూన్ 23 : ధార్మిక క్షేత్రంగా వీరాజిల్లుతున్న వేములవాడను ఆధ్యాత్మికత ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ గెస్ట్‌హౌస్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ, ఆలయ ఈవో రామకృష్ణ, సంబంధిత అధికారులతో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వేములవాడలో చేపట్టిన అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులపై కలెక్టర్‌కు ప్రభుత్వ విప్ వివరించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజరాజేశ్వరస్వామి ఆలయంతోపాటు వేములవాడ పట్టణ అభివృద్ధిని సమాంతరంగా చేపట్టాలన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించడం, ఇబ్బందులు తలెత్తకుండా చూడడం వంటి అంశాలను ప్రధానంగా తీసుకోవాలన్నారు. కోడెల సంరక్షణకు గోశాల షెడ్ల నిర్మాణాన్ని అత్యాధునిక టెక్నాలజీతో చేపట్టాలన్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల మురుగు నీరు గుడి చెరువులో కలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మూలవాగులోకి వస్తున్న మురుగునీరు సైతం మళ్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అర్ధంతరంగా నిలిచిన బ్రిడ్జి, బద్దిపోచమ్మ ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. రాజన్న ఆలయ పార్కింగ్ స్థలంలో 100 గదులతో భక్తుల సౌకర్యార్థం వసతి గదుల నిర్మాణం చేపట్టాలన్నారు. మూలవాగు బ్రిడ్జి నుంచి రాజన్న ఆలయం వరకు రోడ్డు విస్తరణ పనుల కోసం స్థల పరిశీలన చేయాలని, విస్తరణ పనులను ముందుకు సాగేలా చర్యలు చేపట్టాలని అన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది రోజులకే సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించామని, రాజన్న ఆలయానికి రావాల్సిన రూ. 20 కోట్ల నిధులను తిరిగి తీసుకొచ్చామని అన్నారు. వాటితోపాటు రాజన్న ఆలయ అభివృద్ధితోపాటు పట్టణంలో కావాల్సిన అభివృద్ధి పనుల నివేదికను తయారు చేయాలని, వీటీడీఏ వైస్ చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ ద్వారా పంపించాలని సమావేశం నిర్వహించామన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్, కలెక్టర్

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి వచ్చిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ సమావేశం అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఈవో రామకృష్ణ ప్రసాదాన్ని అందజేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ఆలయ అభివృద్ధి మ్యాప్‌ను పరిశీలిస్తున్న విప్, కలెక్టర్

రాజన్న దర్శనం అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ రాజన్న ఆలయ పార్కింగ్ స్థలంలో వసతి గదుల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. భక్తులు దర్శనం చేసుకునే క్యూలైన్‌లో తిరుగుతూ ఇబ్బందులను తెలుసుకున్నారు. స్వామివారి దర్శనం త్వరితగతిన అయ్యేందుకు క్యూలైన్‌లను సుందరీకరించాలని, బ్రేక్ దర్శనం వెసులుబాటును అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గుడి చెరువు, మూలవాగులో కలిసే మురుగు కాలువను పరిశీలించారు. రెండో బైపాస్‌లోని మూలవాగును ఆనుకొని రోడ్డు పక్కన ఉన్న కూరగాయాల మార్కెట్‌ను క్షేత్రసాయిలో సందర్శించి ఆధునాతన 60 స్టాల్స్ నిర్మాణం చేపట్టాలని, రాజన్న ఆలయ గోశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రాజన్న ఆలయానికి వచ్చే గోవులకు సంరక్షణ కోసం సీసీతో ఫ్లోరింగ్ చేయించి అత్యాధునాతన షెడ్లను నిర్మాణం చేయాలని అన్నారు. ఆర్డీవో రాజేశ్వర్, ఈవో రామకృష్ణ, ఆలయ ఈఈ రాజేష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్ మహేష్‌కుమార్ ఉన్నారు.











ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

కోరుట్ల రూరల్, జూన్ 23: మండలంలోని చిన్నమెట్‌పల్లిలో మహాలక్ష్మి అమ్మవారి బోనాల పండగ ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. గ్రామశివారులో ఉన్న అమ్మవారి ఆలయం దాకా డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి బోనాలు నైవేద్యంగా సమర్పించారు. పోతారాజులు చేసిన విన్యాసాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.







మల్లన్న సన్నిధిలో భక్తుల సందడి

- ఒకే రోజు రూ.4 లక్షల ఆదాయం
- వైద్య సౌకర్యం లేక భక్తులకు ఇబ్బందులు



పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, జూన్ 23: పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు సందడి నెలకొంది. వివిధ జిల్లాల నుంచి దాదాపు పదివేల మందికి పైగా వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఒకేరోజు ఆలయానికి రూ.నాలుగు లక్షల మేరకు ఆదాయం సమకూరిందని అధికారుల అంచనా. భక్తులు స్వామిని దర్శించుకునేందుకు మూడు గంటల సమయం పట్టింది. ఆరుద్ర కార్తెలో వర్షాలు పుంజుకునే అవకాశం ఉన్నందున ఆలయంలో భక్తుల రద్దీ పెరుగుతోంది. ఈ మేరకు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. అలాగే కోడే మొక్కులు, బోనాలు, సమర్పించారు. అనంతరం మదనపోచమ్మ, బంగారు పోచమ్మ, వీరభద్రస్వామి రామాలయాన్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఆదివారం, బుధవారం జాతరలో వైద్యం సౌకర్యం ఏర్పాటు చేయాల్సిన సిబ్బంది కనబడకపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. పరకాల మండలానికి చెందిన కొందరు భక్తులు తీవ్రమైన ఉక్కపోతతో అస్వస్థకు గురికాగా చికిత్స కోసం దేవాలయంలోకి వచ్చారు. అక్కడ వైద్య సిబ్బంది లేకపోయేసరికి ఆటోలో పెగడపల్లిలోని ఒక ప్రైవేటు వైద్యుడి వద్ద చికిత్స పొందారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున జాతరలో నీరు కలుషితం అయ్యే పరిస్థితి ఉన్నందున వైద్య సేవలు అందేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

ఇల్లందకుంట, జూన్ 23: మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన బొమ్మ తిరుపతి అనే గీత కార్మికుడు చెట్టు మీద నుంచి కింద పడగా తీవ్ర గాయాల య్యాయి. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి ఆదివారం వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయాడు. తోటి కార్మికులు వెంటనే జమ్మికుంటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వరంగల్ ఆస్పత్రికి తరలించారు. కాగా తిరుపతి నడుముకు తీవ్ర గాయాలయ్యాయి.తిరుపతికి ఆర్థిక సహాయం అందజేయాలని గీత కార్మిక సంఘం నాయకులు శ్రీనివాస్, దేవేందర్ విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్యపై ఆందోళన

గంభీరావుపేట, జూన్ 23: గంభీరావుపేట మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లలో తాగునీటి సమస్యపై కాలనీవాసులు ఆదివారం ఆందోళన చేపట్టారు. నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని, దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. నీటి సమస్యను సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించాలని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

పోకిరీల బెడద

- ద్విచక్రవాహనాలపై త్రిబుల్ రైడింగ్
- కళాశాలలు, బస్టాండ్‌లే ప్రధాన అడ్డాలు



వాహనాల సైలెన్సర్లు ధ్వంసం చేస్తున్న పోలీసులు

సిరిసిల్ల క్రైం, జూన్ 23: జిల్లాలో పోకిరీల బెడద మితిమీరిపోయింది. పట్టణంలోని కళాశాలలు, బస్టాండ్‌లే ప్రధాన అడ్డాలుగా చేసుకొని యువకులు ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతున్నారు. యువకులు ఒక్కో బైక్‌పై త్రిబుల్ రైడింగ్ చేస్తూ ఇబ్బందులపాలు చేస్తున్నారు. జిల్లాలో స్కూల్స్, కళాశాలలు ప్రారంభమయ్యాయి. దీంతో బస్టాండ్‌లు, ఇళ్లనుంచి కళాశాలలకు వెళ్లే యువతులను ఆటపట్టిస్తున్నారు. యువకుల ఆకతాయి చేష్టలకు కళాశాలకు వెళ్లే విద్యార్థినులు, యువతులు ఆందోళన చెందుతున్నారు. పోకిరీల ఆగడాలపై షీటీమ్ నిఘా వేసినప్పటికీ పోకిరీల ఆగడాలు ఆగడంలేదు. షీటీమ్ బృందాలు కౌన్సెలింగ్ ఇస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు.

● ద్విచక్రవాహనాలపై చక్కర్లు

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణంలో పోకిరీలు ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతూ ఆందోళనకు గురి చేస్తున్నారు. యువకుల చేతిలో ద్విచక్రవాహనంపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కళాశాలలకు వెళ్లే విద్యార్థినులు, యువతులను ఇబ్బందుల పాలు చేస్తున్నారు. విద్యార్థినుల ఇళ్ల ముందు చక్కర్లు కొడుతూ హారన్‌లు మోగిస్తూ విసిగిస్తున్నారు. బైక్‌లకు ఎక్కువ శబ్దం వచ్చే హారన్‌లు నిబంధనలకు విరుద్ధంగా బిగిస్తున్నారు. ద్విచక్రవాహనాలు నడిపే యువకులకు ఎలాంటి లైసెన్స్ ఉండదు. మరోవైపు ద్విచక్రవాహనంపై ముగ్గురు రైడింగ్ చేస్తూ ఆందోళన కలిగిస్తున్నారు. కాగా షీటీమ్‌లు పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చినా పోకిరీల బెడద తప్పడం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ఏడాదిలో వందలాదిమంది యువకులకు షీటీమ్ బృందాలు కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో సిరిసిల్ల పట్టణంలోని కొందరు యువకులు స్నేహితులుగా ఏర్పడి ఇంట్లో నుంచి డబ్బులు తీసుకెళ్లి ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతూ జల్సాలు చేసి కటకటాలపాలైన విషయం తెలిసిందే. మరోవైపు సిరిసిల్ల పట్టణంలోని పాతబస్టాండ్, కళాశాలలు, తదితర రద్దీ ప్రదేశాల్లో బైక్‌పై చక్కర్లు కొడుతూ ఆకతాయి చేష్టలకు పాల్పడిన అనేకమంది యువకులను షీటీమ్స్ అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు.

● షీటీమ్‌ల నిఘా..

సిరిసిల్ల, వేములవాడ పట్టణంలో పోకిరీలపై షీటీమ్‌లు నిఘా వేసినా ఆగడాలు తప్పడంలేదు. జిల్లాలో రెండు షీటీమ్‌లు పనిచేస్తున్నాయి. సిరిసిల్ల, వేములవాడలో ఒక్కో షీటీమ్‌లు ఎప్పటికప్పుడు నిఘాను పెంచారు. ప్రధానంగా బస్టాండ్‌లు, కూడళ్లు, కళాశాలల వద్ద నిఘా వేస్తున్నారు. మే నెలలో ముగ్గురు పోకిరీలపై కేసు నమోదు చేసి మరో నలగురిపై పెట్టి కేసులు పెట్టారు. అధిక శబ్దం చేస్తున్న 86 ద్విచక్రవాహనాలను గుర్తించి వాటి సైలెన్సర్‌లను రోడ్ రోలర్ చేత ధ్వంసం చేశారు. మహిళలను, విద్యార్థినులను వేధిస్తున్న వారిని గుర్తించి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. ఎక్కడైనా పోకిరీలు యువతులను ఇబ్బందుల పాలు చేస్తే డయల్ 100కు లేదా 8712656425కు సమాచం అందిస్తే వెంటనే షీటీమ్‌లు రంగంలోకి దిగి రక్షణ కల్పిస్తాయి.

నిఘా తీవ్రం : అఖిల్ మహాజన్, ఎస్పీ



జిల్లాలో పోకిరీల ఆగడాలపై నిఘా తీవ్రం చేశాం.. మహిళలు, యువతులను వేధింపులకు గురించేస్తే కఠిన చర్యలు తప్పవు. మహిళల భద్రతకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. అనుమానాస్పద వ్యక్తులు, పోకిరీలు కనిపిస్తే 8712656425, 100కు సమాచారం ఇవ్వాలి. వెంటనే చర్యలు తీసుకుంటాం.

సాయికిరణ్ హత్య కేసులో నిందితుల అరెస్టు

మానకొండూర్, జూన్ 23: మానకొండూర్‌కు చెందిన సాయికిరణ్ హత్య కేసులో నలుగురు నిందితుల మానకొండూర్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సాయి కిరణ్‌కు హత్య చేసిన బట్టి శ్రీనివాస్, బట్టి సునీత, తమ్మిడి గంగారాం, భీమంకర్ శ్యాంరావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాలతో నలుగురిని 14 రోజుల రిమాండ్‌కు కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. మానకొండూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... సాయికిరణ్ కొద్దికాలం కిందట సిద్దిపేట జిల్లా మిడిదొడ్డి మండలం కొండాపూర్‌లో కోళ్లఫాంలో కూలీగా పనిచేస్తూ భార్యపిల్లలతో కలిసిఉండేవాడు. అదేఫాంలో పని చేస్తున్న బట్టి శ్రీనివాస్, బట్టి సునీతలతో సాయి కిరణ్‌కు స్నేహం ఏర్పడింది. సునీతతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో వారి మధ్య గొడవ జరగడంతో అక్కడ పనిమానేసిన సాయి కిరణ్ మానకొండూర్‌కు వచ్చి ఒక సామిల్‌లో పనిచేస్తుండేవాడు. ఏప్రిల్ 18న సాయికిరణ్ కొండాపూర్ ఫాంకు వెళ్లి అక్కడ శ్రీనివాస్, సునీతతో మళ్లీ గొడవపడ్డాడు. దీంతో శ్రీనివాస్, అతని భార్య సునీత అక్కడి నుంచి వారి స్వగ్రామం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం బారెగూడెంకు వెళ్లిపోయారు. అయినప్పటికీ సాయికిరణ్ వారికి ఫోన్ చేసి వేధించసాగాడు. దీంతో విసిగిపోయిన బట్టి శ్రీనివాస్, సునీత దంపతులు ఎలాగైనా సాయికిరణ్‌ను అడ్డుతొలగించుకునేందుకు పథకం రచించారు. ఈ మేరకు ఏప్రిల్ 19న సునీతతో సాయికిరణ్‌కు ఫోన్ చేయించి వారి స్వగ్రామానికి పిలిపించుకున్నారు. సాయి కిరణ్ రాగానే అతడిపై కర్రలతో దాడి చేసి హత్య చేశారు. అనంతరం సాయికిరణ్ మృతదేహాన్ని పాడుబడిన వ్యవసాయబావిలో పడేశారు. ఏప్రిల్ 18న ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాయికిరణ్ ఇంటికి రాలేదని అతడి భార్య మానకొండూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి రెండు నెలలపాటు తీవ్రంగా గాలించి నిందితులను పట్టుకున్నారు.

ఇసుక డంపులు స్వాధీనం



పాషిగామలో ఇసుక డంపులు సీజ్ చేస్తున్న అధికారులు

వెల్గటూర్, జూన్ 23: మండలంలోని స్తంభంపల్లి, పాషిగామలో నిల్వ ఉంచిన అక్రమ ఇసుక డంపులను ఆదివారం అధికారులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. వేసవిలో ఎండల ప్రతాపానికి గోదావరిలో నీటి మట్టం పడిపోవడంతో ఇసుక తేలింది. గోదావరి ఇసుక కొందరి అక్రమార్కుల కన్ను పడింది. కొందరు ట్రాక్టర్ యజమానులు దొరికిన కాడికి దోచుకుందామని గోదావరిలో ఇసుకను తోడి శివారు ప్రాంతాల్లో నిల్వ చేశారు. మరికొందరు రూ.2 వేల నుంచి రూ.2400ల వరకు ఇతరులకు అమ్ముకున్నారు. కొన్ని రోజులుగా ఈ తంతు కొనసాగుతుండగా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు అక్రమ ఇసుక డంపులపై దాడులు నిర్వహించారు. స్తంభంపల్లి శివా రులో ఎల్లమ్మ గుడి ప్రాంతంలో ఏడు చోట్ల నిలువ ఉంచిన 700 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను పట్టుకున్నారు. పాషిగామ శివారులో సుమారు 169 ట్రాక్టర్ ట్రిప్పుల అక్రమ ఇసుకను గుర్తించి పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ జయసింగ్, తహశీల్దార్ శేఖర్, ఎస్సై ఉమా సాగర్, ఆర్ఐ రాజేశ్వరి, రాయల్టీ ఇన్స్‌పెక్టర్ తిరుపతి రావు, డీటీ గంగాధర్, జూనియర్ అసి స్టెంట్ సుదర్శన్, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి టిప్పర్లు పట్టివేత



పట్టుకున్న మట్టి టిప్పర్లు

ఎల్లారెడ్డిపేట, జూన్ 23: అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు మట్టి టిప్పర్లను ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట పట్టుకున్నట్లు తహసీల్దార్ రామచంద్రం ఆదివారం తెలిపారు. మట్టిని రవాణా చేస్తున్నారనే సమాచారం మే రకు తనిఖీ చేశామని, తరలింపునకు ప్రభుత్వ అను మతి లేదని తేలిందని పేర్కొన్నారు. తమను చూసిన వాహన డ్రైవర్లు పారిపోయారని, వాహనాలను కార్యాలయానికి తరలించి సీజ్ చేశామన్నారు. అను మతి లేకుండా ఇసుక, మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బైక్ అదుపు తప్పి రైతుకు గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 23: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రైతు చర్చ మండలి సమీపంలో ఆదివారం ద్విచక్రవాహనం అదుపు తప్పిన సంఘటనలో స్థానిక రైతు బాధ రాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రాజు తన బైక్‌పై ఎల్లమ్మ ఆలయం వైపునకు వెళ్తుండగా వాహనం అదుపు తప్పింది.

పేకాట స్థావరంపై దాడులు

రుద్రంగి, జూన్ 23: మండల కేంద్రం శివారులోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఆ పేకాట స్థావరంపై శనివారం రాత్రి దాడి చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. రుద్రంగి, చందుర్తి మండలాల శివారు లోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేశామని, ఐదుగురిని పట్టుకున్నామని, మరో ఐదుగురు పారిపోయారని పేర్కొన్నారు. రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు, పది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్‌పై వచ్చి.. చెప్పులు దొంగిలించి..



సీసీ ఫుటేజీకి చిక్కిన అనుమానితుడు

ఓదెల, జూన్ 23: ఆర్థికంగా చితి కి పోయి గానీ, జల్సాలకు అలవాటు పడి గానీ కొందరు దొంగలు చోరీ లకు పాల్పడి డబ్బు, ఆభరణాలు దోచుకెళ్తారు. కానీ ఒక గుర్తుతెలి యని దొంగ స్టైల్‌గా ఖరీదైన బైక్ మీద ఓదెల మల్లికా ర్జునస్వామి ఆలయానికి తరచూ వచ్చి ఒకే వ్యక్తి కి సంబంధించిన మూడు జతల చెప్పులను ఎత్తుకెళ్లా డు. ఇదంతా సీసీ ఫుటేజీకి చిక్కింది. ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ముద్దసాని కుమారస్వామికి చెందిన మూడు జతల పాద రక్షలను ఇప్పటివరకు ఎత్తుకెళ్లాడు. కేవలం ఒకే వ్యక్తికి చెందిన మూడు జతలు చెప్పులను ఎత్తుకెళ్లడం సీసీ ఫుటేజీలో రికార్డు అయింది. చోరీకి పాల్పడిన వ్యక్తి ఎవరు? పాద రక్షలను ఏం చేస్తున్నాడనేది? తెలియాల్సి ఉంది.

ఘనంగా హ్యాండ్‌బాల్ దినోత్సవం

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 23: ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ హ్యాండ్‌బాల్ దినోత్సవం, ప్రపంచ ఒలింపిక్ దినోత్స వాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని లయోల విద్యాసంస్థల మైదానంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసర వేని లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్నారు. కార్యక్ర మంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నమిలికొండ ప్రభాకర్, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేష్, నాగుల శ్రీనివాస్, జె విజయ్, శ్రీకాంత్, అమర్, శివాజి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సంస్థను కాపాడుకుందాం



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

సుభాష్‌నగర్, జూన్ 23: సింగరేణి బొగ్గు గనులను వేలం వేయకుండా సంస్థను కాపాడుకుందామని కార్మికులకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. సింగరేణిని వేలం వేస్తే చూస్తూ ఊర్కొనేది లేదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణిని ప్రైవేటీకరణ చేయడానికి అడుగులు వేస్తున్నాయని విమర్శించారు. సింగరేణిని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రిగా కిషన్‌రెడ్డిపై ఉందన్నారు. గతంలో నష్టాల్లో ఉన్న సంస్థ కార్మికులు, యాజమాన్యం సమష్టి కృషితో నష్టాల నుంచి గట్టెక్కిందన్నారు. లాభాల్లో ఉన్న ఈ సంస్థను ప్రైవేటీకరణ చేయడం ఏమిటని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దేశంలోని అనేక బొగ్గు గనులతో పాటు సింగరేణి బొగ్గు గనులను కూడా వేలం వేయడానికి నిర్ణయం తీసుకోవడం దురదృష్టకరమని కొప్పుల ఈశ్వర్ అన్నారు. సింగరేణిని బొంద పెట్టడానికే ప్రధాని మోదీ కిషన్‌రెడ్డికి బొగ్గు శాఖ మంత్రి పదవి ఇచ్చినట్లుందని విమర్శించారు. బొగ్గు బావుల వేలంలో సింగరేణికి సంబంధించిన శ్రావణపల్లి కోల్‌బ్లాక్ కూడా ఉందని తెలిపారు. ఇది ఖచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వం యొక్క దిగజారుడుతనానికి నిద ర్శనమని, ఇదంతా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిస్తే తెలంగాణ ప్రజలకు ఇచ్చే తొలి రిటర్న్ గిఫ్టు ఇదేనా అని ప్రశ్నించారు. బొగ్గు గనుల వేలాన్ని అభ్యంతరం చెప్పాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీతని ఆహ్వానిస్తు న్నారని ఆరోపించారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న రేవంత్ రెడ్డి వేలాన్ని వ్యతిరేకిస్తూ మోదీకి లేఖ రాశారని ఈ సందర్భంగా కొప్పుల గుర్తు చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి ప్రధానికి ఎందుకు లేఖ రాయడం లేదని ప్రశ్నించారు. వేలం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొనబోతున్నారని ఆయన ఆరోపించారు. వేలంపై సింగరేణి గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ నోరు విప్పాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో సింగరేణిని ప్రైవేటు పరం చేయవద్దని, ఆ ఆలోచనను వెంటనే ఉప సంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో పెద్దపల్లి జడ్పీ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఓరుగంటి రమణారావు, గంగుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మంత్రి పొన్నం లీగల్ నోటీసులు

కరీంనగర్ అర్బన్, జూన్ 23: ఫ్లై యాష్ తరలింపు విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌పై నిరాధార ఆరోపణలు చేశాడంటూ బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మంత్రి తరఫున అడ్వకేట్ పూర్ణచందర్‌రావు లీగల్ నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యేతో పాటు టీ న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్ జోగినిపల్లి సంతోష్‌కుమార్, నమస్తే తెలంగాణ దినపత్రిక చీఫ్ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి, తెలంగాణ పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు లీగల్ నోటీసులు జారీ అయ్యాయి. ఫ్లై యాష్ అనేది ఎన్టీపీసీ నుంచి ఉత్పత్తి అవుతుందని, దాన్ని వినియోగించుకునేందుకు వీలుండదని నోటీసుల్లో తెలిపారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్‌లో ఫ్లై యాష్ లారీలను నిలిపివేసి ఓవర్‌లోడ్‌తో వెళుతున్నాయని, ప్రతి లారీకి డబ్బులు తీసుకుంటూ పంపిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ పరువుకు భంగం కలిగేలా నిరాధార ఆరోపణలు చేశారని నోటీసుల్లో పేర్కొన్నారు. వ్యక్తిగత కక్షతో రాజకీయంగా ఎదుర్కోలేక మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చేసిన ఆరోపణలకుగాను ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి లీగల్ నోటీసులు జారీ చేశారు. ఈ వార్తను ప్రసారం చేసిన టీ న్యూస్‌తో పాటు నమస్తే తెలంగాణ దినపత్రికకు కూడా అడ్వకేట్ పూర్ణచందర్‌రావు లీగల్ నోటీసులు జారీ చేశారు.

శిథిలమైన కెనాల్ లైనింగ్



దెబ్బతిన్న లైనింగ్

మల్యాల, జూన్ 23: ఎస్సారెస్పీ కెనాల్ లైనింగ్ శిథిలం అయ్యాయి. మల్యాల మండలంలోని లంబాడిపల్లి శివారులో కొంపల్లె చెరువు సమీపంలో లైనింగ్ పూర్తిగా శిథిలమై మట్టి పెళ్లలు లేస్తున్నాయి. లైనింగ్ శిథిలమైన ప్రదేశాల్లో కెనాల్ నీటితో అక్కడ కోతకు గురై ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. ఎస్సారెస్పీ అధికారులు లైనింగ్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్వానం..ఈ రహదారి

మల్యాల, జూన్ 23: మల్యాల బ్లాక్ చౌరస్తా నుంచి వెళ్లే మల్యాల-పెగడపల్లి మార్గం అధ్వానంగా మారింది. ఏళ్ల తరబడిగా రహదారి విస్తరణ పనులు కొనసాగుతుండడంతో గోతులు ఏర్పడి, కంకర లేచి ప్రమాదకరంగా మారగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయిప్పటికీ పనులు పూర్తి చేయడంపై ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపడం లేదు. దీంతో ప్రయాణికులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కంకర తేలి ప్రమాదకరంగా మారిన రహదారి

బాలికపై వృద్ధుడి అత్యాచారం

- నిందితుడిని చితకబాది పోలీసులకు అప్పగించిన స్థానికులు
- పోక్సో కింద కేసు నమోదు

రాయికల్, జూన్ 23: జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో సింగు గంగనర్సయ్య (60) అనే వృద్ధుడు ఓ బాలికను మాయ మాటలు చెప్పి తన టైలర్ షాపునకు పిలిపించుకుని ఆదివారం అత్యాచారానికి ఒడిగట్టాడు. స్థానికులు నిందితుడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రాయికల్‌కు చెందిన సింగు గంగనర్సయ్య అనే వృద్ధుడు టైలర్ షాపు పెట్టుకుని జీవిస్తున్నాడు. తరచూ టైలర్ షాపునకు వచ్చే ఓ బాలికను ఆదివారం తన షాపునకు పిలుచుకుని మాయమాటలు చెప్పి అత్యాచారానికి ఒడిగట్టాడు. బాలిక షాపునకు వెళ్లిన తర్వాత షట్టర్ తలుపు మూసివేయడంతో గమనించిన స్థానికులు బాలిక కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. అనంతరం కుటుంబీకులతో కలిసి స్థానికులు షట్టర్‌ను తీయాలని బెదిరించడంతో ఈ ఘటన వెలుగుచూసింది. స్థానికులు వృద్ధుడిని చితకబాది అనంతరం పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు వృద్ధుడిపై పోక్సో కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఏఎస్సై దేవేందర్ తెలిపారు.

బీజేపీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి

- సన్న రకం సాగుచేసే రైతులకు రూ. 500 బోనస్ - ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



రేచపల్లిలో కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్, జూన్ 23: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాలు, దేశంలో ఎక్కడ అమలు జరగడం లేదని ప్రభుత్వాన్ని విమర్శించే ముందు బీజేపీ నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రేచపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ సన్నరకం సాగు చేయమని ఆంక్షలు విధించి ఏ రకమైన బోనస్ ఇవ్వకుండా రైతులను మోసం చేశాడని గుర్తు చేశాడు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధమైన ఆంక్షలు లేకుండా సన్న రకం సాగు చేసే రైతులకు క్వింటాల్‌కు 500 రూపాయలు బోనస్ ఇచ్చి రైతులను ఆదకుంటామని తెలిపారు. నిరుపేదలకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్న రకం సాగును రూ. 500 బోనస్ కల్పించి ప్రోత్సహిస్తుందన్నారు. రైతులపై ఆర్థిక భారం పడకుండా పంటల బీమా పథకానికి 50 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ ప్రీమియం చెల్లిస్తుందని అన్నారు. గత ప్రభుత్వం పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేయలేదని ఇంకా నాలుగువేల కోట్లు బకాయిలు చెల్లింపు చేయలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రెండు పర్యాయాలు కలిపి రూ 28వేల కోట్లు అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షలు ఏక మొత్తంలో రూ 31వేల కోట్లతో రుణమాఫీ చేస్తోందన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా రాష్ట్రంలో 100 శాతం తాగు నీరందించామని కేంద్ర ప్రభుత్వానికి తప్పుడు నివేధిక సమర్పించడంతో రాష్ట్రానికి రావల్సిన నిధులు పొందలేక పోతున్నామన్నారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో భగీరథ నీరు ఏ మేరకు అందుతుందో పూర్తిస్థాయిలో సర్వే చేయిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో రేచపల్లిలో నీటి కొరత ఉత్పన్నం కాకుండా గ్రామంలో మంచి నీటి బావికి ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో గాజుల నిర్మాణం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్ గౌడ్, తిరుపతిరెడ్డి, ఆకుల రాజిరెడ్డి, ఇబ్రాహీం, లక్ష్మారెడ్డి, హరీష్, ఆకుల రాజిరెడ్డి, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి అవగాహన శూన్యం



చర్చావేదికలో మాట్లాడుతున్న వి ప్రకాశ్

కరీంనగర్ టౌన్, జూన్ 23: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి అవగాహన లేదనే విషయం స్పష్టమైందని ప్రముఖ జలవనరుల నిపుణులు వి.ప్రకాశ్ అన్నారు. ఆదివారం నగరంలోని ఫిలింభవన్‌లో డాక్టర్ బీఎస్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాళేశ్వరాన్ని కాపాడుకుందాం అనే అంశంపై నిర్వహించిన చర్చా వేదికకు ఆయన ప్రధాన వక్తగా హాజరయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాముఖ్యతపై వివరంగా చర్చించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా బ్యారేజీలు ఇసుకలో నిర్మిస్తారా అని సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే అన్నారని, బ్యారేజీలు ఇసుకలోనే నిర్మిస్తారనే విషయంపై ఆయనకు అవగాహన లేక పోవడం హాస్యాస్పదమని అన్నారు. మేడిగడ్డ బ్యారేజీకి 86 పియర్స్ ఉంటే మూడు పీయర్స్ దెబ్బతిన్నాయని అయినంత మాత్రాన ప్రాజెక్టును మూలన పడేస్తారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌ను ఓడించాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్, బీజేపీలు కాళేశ్వరంపై విషప్రచారం చేశాయని అన్నారు. డ్యాం సేఫ్టీ అథారిటీ కూడా ఈ పార్టీలకే వంత పాడిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు ప్రచారం చేశారని, తెలంగాణ ప్రజలు దానిని నమ్మారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ముందు, తర్వాత పరిస్థితులను గమనిస్తే కేసీఆర్ ప్రభుత్వం సాగునీటికి ఎంత ప్రాధాన్యత ఇచ్చిందో అర్థమవుతుందని అన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కట్టవద్దని కేసీఆర్ అనలేదని, అందుకు సెంట్రల్ వాటర్ కమిషన్, అప్పటి మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోలేదని స్పష్టం చేశారు. తాను ఏపార్టీలో లేనని, రాజకీయాలతో సంబంధం లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ ప్రజలు ఉద్యమించాలని, మేధావి వర్గం అందుకు కృషిచేయాలని కోరారు. తెలంగాణకు గుండె కాళేశ్వరం ప్రాజెక్టు అని, కేవలం మూడు పీయర్లు కుంగిపోతే ప్రాజెక్టును మూలన పడేస్తారా, పనులు చేసేందుకు ఎల్అండ్‌టీ కంపెనీ ముందుకు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని బీఎస్‌రావు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎస్‌రావు ప్రశ్నించారు. ప్రజల సొత్తు అయిన కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకోవలసిన బాధ్యత తెలంగాణ ప్రతి పౌరుడిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో జగిత్యాలకు చెందిన రాజం తదితరులు పాల్గొన్నారు.

ముందుచూపేదీ?

- యేటా వర్షాకాలంలో నీట మునుగుతున్న కాలనీలు - పట్టించుకోని అధికారులు



రాయికల్‌లో నీట మునిగిన కేశవనగర్ (ఫైల్)



కాలనీలో నీట మునిగిన ఇళ్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ (ఫైల్)

రాయికల్, జూన్ 23: అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో యేటా వర్షాకాలంలో రాయికల్ పట్టణంలోని పెద్ద చెరువు వరదతో ముంపు ఏర్పడుతుంది. పట్టణ శివారు కాలనీలు నీట మునుగుతుండటంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. పెద్ద చెరువు 200 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, రాయికల్, మైతాపూర్, చెర్లకొండాపూర్ గ్రామాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భజలాల పెంపునకు ఎంతో దోహదపడుతుంది. వర్షాకాలంలో చెరువు నిండి వరదనీరు ఉప్పొంగి ప్రవహించినప్పుడు పట్టణంలోని 5, 6, 7 వార్డుల్లోని ఇళ్లలోకి నీరు చేరుతుంది. భీమన్నవాడ, మత్తడి వాడ, గొల్లవాడ, కేశవనగర్ కాలనీవాసులు వర్షాకాలం వచ్చిందంటే ఆందోళన చెందుతున్నారు. అంతేగాకుండా పెద్ద చెరువు నిండినప్పుడు చెర్లకొండాపూర్, రాయికల్, మైతాపూర్‌లోని చెరువు కట్ట తీర ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాలు నీట మునగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. లోలెవల్ వంతెనతో వర్షాకాలంలో ప్రజలకు ముప్పు పొంచి ఉంది. చిన్న వర్షాలకు సైతం లోలెవల్ వంతె నలపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచి పోతు న్నాయి. మండలంలోని ఇటిక్యాల, మూటపెల్లి, వస్సాపూర్, ధర్మాజీపేట, రామాజీపేట గ్రామాల్లో లోలెవల్ వంతెనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నివారణ చర్యలు చేపట్టి ముంపునకు గురి కాకుండా చూడాలని కోరుతున్నారు.

ఇళ్లలోకి వరద నీరు వస్తోంది..



రాయికల్ పట్టణంలో గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు కేశవనగర్, గొల్లవాడ, మత్తడివాడ, భీమన్నవాడ లోకి నీరు చేరడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షాకాలంలో ముందస్తు చర్యలు తీసుకొని నీరు చేరకుండా చూడాలి

- నీలి తిరుపతి, సింగిల్ విండో డైరెక్టర్

ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు..



మా వార్డులో వర్షం పడితే చాలు ఇళ్లలోకి నీరు వస్తున్నాయి. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఈసారైనా వరదలు రాక ముందే చర్యలు చేపడితే కాలనీవాసులకు ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ముంపు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి. వర్షాలు కురిస్తే ఇబ్బందులు రాకుండా చూడాలి.

- అన్వరీ బేగం, 6వ వార్డు కౌన్సిలర్, రాయికల్

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆటలు



దుమాలలో కప్పతల్లి ఆట ఆడుతున్న రైతులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 23: వర్షాలు కురవాలని ఎల్లారెడ్డిపేట మండలం దుమాల రైతులు, యువకులు ఆదివారం కప్పతల్లి ఆటలు ఆడారు. స్థానిక పోచమ్మ ఆలయం వద్ద కప్పను కర్రకు కట్టి ఇంటింటా తిరిగారు. ప్రజలు బిందెలతో కప్పపై నీళ్లు పోశారు. ఊరూరా డప్పుచప్పుళ్ల మధ్య కప్ప తల్లి ఆటలు ఆడారు. కార్యక్రమంలో యువకులు మధుయాదవ్, మనోజ్, రాజు, రాజేశ్, భరత్, మధు, శరవింద్, బాలమల్లు, తిరుమలేశ్, చందు, అంజనేయులు, రవి, మల్లేశం పాల్గొన్నారు.

పోలీసులు, పాత్రికేయుల ఫ్రెండ్లీ క్రికెట్ పోటీ



ఎస్సైతో పోలీస్ సిబ్బంది, పాత్రికేయ బృందం

గంభీరావుపేట, జూన్ 23 : గంభీరావుపేట కేజీటూపీజీ మైదానంలో ఆదివారం పోలీసులు, పాత్రికేయుల ఫ్రెండ్లీ క్రికెట్ పోటీ నిర్వహించారు. పోటీలో పోలీస్ టీం విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన పోలీస్ టీం తొలుత బ్యాటింగ్ చేసింది. అనంతరం బ్యాటింగ్ దిగిన విలేకరుల టీం లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. ఎస్సై రాంమోహన్‌తోపాటు సిబ్బంది, పాత్రికేయులు యాదగిరిగౌడ్, శ్రీనివాస్, రహీం, దేవేందర్, శేఖర్‌రెడ్డి, సాదత్, రమేష్, మల్లేశం, చారీ, శ్రీకాంత్, మహేష్, అర్జున్‌రెడ్డి, బాస్కర్ తదితరులు ఉన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

కోనరావుపేట, జూన్ 23 : కోనరావుపేట మండల బీజేపీ నాయకులతో పాటు జిల్లా నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ, మండల నాయకులు బైరగోని సురేష్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి జింక వెంకటి, తిరుపతి, మధు, రామస్వామి, రాజేశం, అంభోజ లక్ష్మీనారాయణ, సాయి, బుర్ర ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడకండి అండగా ఉంటాం

సిరిసిల్ల రూరల్, జూన్ 23 : నేతన్నలకు అండగా ఉంటామని అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందికట్ల స్వామి, తెలంగాణ ప్రాంతీయ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కామర్థాపు మురళి, జాతీయ కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రామచంద్రం ప్రకటనలో కోరారు. ఉపాధి లేదని ఆత్మహత్య చేసుకోవడం సరికాదని, ఇతర ఉపాధి పనులు చేసుకోవాలని సూచించారు. అధైర్య పడి ప్రాణాలను తీసుకోవద్దని కోరారు.

రెడ్డి సంఘం అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి

ఇల్లంతకుంట, జూన్ 23: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా కేతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఎన్నికయ్యారు. రెడ్డిసంఘ భవనంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడు కదార రవీందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా కేతిరెడ్డి నారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కదార వెంకటరమణారెడ్డి, కోశాధికారిగా కేతిరెడ్డి వెంకటరెడ్డిని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి రెడ్డిసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రాజేందర్‌రెడ్డితోపాటు నాయకులు అభినందనలు తెలిపారు.

పిల్లలకు చదువు నేర్పించండి

సిరిసిల్ల రూరల్, జూన్ 23: పద్మశాలి కులస్థులు తమ కులవృత్తికి పిల్లలను దూరంగా ఉంచి మంచి చదువును నేర్పించాలని, ఉద్యోగ అవకాశాలు వచ్చేలా తల్లిదండ్రులు కృషి చేయాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామార్తపు మురళి కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని కార్మిక క్షేత్రమైన రాజీవ్‌నగర్‌లో ఆదివారం పర్యటించారు. పలువురు పద్మశాలి కులానికి చెందిన కుటుంబాల మహిళలతో ముచ్చటించారు. వారి వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు పిల్లల చదువులు, కుటుంబ పోషణ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పద్మశాలి కులస్థులకు సంబంధించిన చేనేత, మరమగ్గాల పరిశ్రమల్లో ఉపాధి తగ్గిపోతున్న దృష్ట్యా మరో ఉపాధి కోసం ప్రయత్నించి ఉపాధిని చేసుకుంటూ కుటుంబాలను పోషించుకోవాలని సూచించారు. ఇంటికి పెద్దలు పనులు చేసుకుంటుంటే మహిళలు కూడా వారికి అండగా ఉంటూ పనులు చేసుకోవాలని, పిల్లలను ఉన్నత చదువు చదివించాలని సూచించారు. కుల వృత్తి వైపు పిల్లలను తీసుకురాకుండా చదువుతో ఉద్యోగాలను సాధించుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు గోలి వెంకటరమణ, మండల సత్యం, ఎనుగుల ఎల్లయ్య, తాటిపాముల దామోదార్, గాజుల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల పర్యటనకు వచ్చిన అఖిల భారత పద్మశాలి సంఘం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం నాయకులను ఆదివారం పట్టణంలోని వస్త్ర వ్యాపార సంఘం భవనంలో పాలకవర్గం ఘనంగా సన్మానించింది. పర్యటనకు వచ్చిన అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందికట్ల స్వామితోపాటు తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కామర్థాపు మురళి, జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రామచందర్‌రావు, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు మెతుకు సత్యం, రాజకీయ విభాగం అధ్యక్షుడు వాసాల రమేష్, చేనేత విభాగం అధ్యక్షుడు కందికట్ల భిక్షపతిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, గౌడ రాజు పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమించే ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

వేములవాడ టౌన్, జూన్ 23 : నూతన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించే ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్‌ఎస్వీ నియోజకవర్గ నాయకుడు పోతు అనిల్ డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు విద్యను వ్యాపారంగా మలుచుకుంటున్నాయన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. యూనిఫామ్, బుక్స్ పేరుతో వేలకు వేలు దండుకుంటున్నాయని మండిపడ్డారు. ఉపాధ్యాయుల విద్యార్హతతోపాటు స్కూల్ ఫీజు బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు పట్టించుకోని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో దిలీప్, రాకేష్, సందీప్, మహేందర్ తదితరులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

భగత్‌నగర్, జూన్ 23: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, సమాజంలో సగభాగం ఉన్న మహిళలకు సమాన హక్కులు కల్పించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఆదివారం కరీంనగర్ కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ఐద్వా జిల్లా స్థాయి సమావేశాన్ని ద్యావ అన్నపూర్ణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి మల్లు లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆరు హామీలు ఇచ్చిందని, అందులో మూడు అమలు చేయడం అభినందనీయమన్నారు. మహిళలకు నెలకు 2,500 రూపాయలు ఇవ్వాలని, అర్హులైన మహిళలందరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇవ్వాలని, ఇంటి స్థలం ఉన్న పేద మహిళలకు నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలపై వేధింపులు, అఘాయిత్యాలు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఆరేళ్ల పసిపాపపై అత్యాచారం చేసి హత్య చేయడం దారుణమన్నారు. భూపాలపల్లి జిల్లాలో రక్షణ కల్పించాల్సిన ఎస్సై తన మహిళా కానిస్టేబుల్‌ను లైంగికంగా వేధించడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళలపై చులకన భావంతో ఉందని, మహిళా రెజ్లర్లను బీజేపీ నాయకులు వేధించడం, మణిపూర్‌లో మహిళల్ని నగ్నంగా ఊరేగించినా ప్రధాని నరేంద్రమోదీ పెదవి విప్పకపోవడం విచారకరమన్నారు. జూలై 25 నుంచి 28 వరకు రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా కార్యదర్శి నాగమణి, సంధ్య, రజిత, స్వరూప, దేవేంద్ర, యమున పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సౌకర్యాలు కరువు

- పల్లె దవాఖానాలో కొనసాగుతున్న సెంటర్
- వసతులు లేక సిబ్బంది, రోగుల ఇబ్బందులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 23: గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోంది. వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. వైద్యసేవలు పేదల దరి చేరుతున్నా సౌకర్యాలు లేక వైద్య సిబ్బంది, రోగులు అవస్థలు పడుతున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వం సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చడంతో అందులో ఇంతా కాలం సేవలందించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బొప్పాపూర్‌లోని పల్లె దవాఖానకు చేరింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో వైద్యసేవలు అందిస్తున్నారు. పల్లె దవాఖానకు కేటాయించిన భవనంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొనసాగుతోంది. సరైన సౌకర్యాలు లేక అటు వైద్య సిబ్బంది, ఇటు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. భవనంలో ఉన్న ఓ గదిని పల్లె దవాఖానా సేవలకు కేటాయించి మిగిలిన చిన్నపాటి మూడు గదుల్లో వైద్యం అందించాల్సి వస్తోంది. వైద్య చికిత్స కోసం వస్తున్న రోగులు కూర్చునేందుకు వసతులు లేక నిలబడాల్సిన దుస్థితి. మరోవైపు వైద్యులు పరీక్షించినా పీహెచ్‌సీలో మందులు లేక మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నామని రోగులు వాపోతున్నారు.

ఇరుకు గదులు.. సిబ్బంది, రోగుల ఇబ్బందులు

మండలంలోని బొప్పాపూర్ పల్లె దవాఖాన భవనంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొనసాగుతోంది. నిత్యం 30 నుంచి 50 మంది వరకు వివిధ రకాల



పీహెచ్‌సీ సేవలు అందిస్తున్న పల్లె దవాఖానా భవనం

వ్యాధులతో బాధ పడుతున్న రోగులు వస్తున్నారు. వీర్నపల్లి మండలంలోనూ పీహెచ్‌సీ భవనం లేకపోవడంతో ఇక్కడి నుంచే సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించేందుకు సరైన వసతులు లేకపోవడంతో ఇరుకు గదుల్లోనే వైద్య సేవలను అందిస్తున్నారు. గర్భిణులు, చిన్నారులకు టీకా పంపిణీ తదితర సేవలు ఇబ్బందిగా మారింది. సరైన సౌకర్యాలు లేకపోవడంతో మండల కేంద్రంలోని సీహెచ్‌సీలోని రేకుల షెడ్డుకు తీసుకొచ్చి వైద్యం అందించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

మందులు కరవు

బొప్పాపూర్‌లోని పల్లె దవాఖానలో కొనసాగుతున్న పీహెచ్‌సీలో ఇన్‌చార్జి వైద్యులు స్రవంతి, చిరంజీవి, నలుగురు సూపర్‌వైజర్లలో ఇటీవల ఒకరు పదవీ విరమణ పొందగా మరొకరు జిల్లా కేంద్రంలోని పీవోలో కొనసాగుతున్నారు. ఒకరు డిప్యూటేషన్‌పై ఇల్లంతకుంటకు వెళ్లారు. ఒక్కరు మాత్రమే విధులను నిర్వహిస్తున్నారు. ముగ్గురు హెల్త్ అసిస్టెంట్లలో ఒకరు జిల్లాలో నిర్వహిస్తున్న కిరణం కార్యక్రమంలో, మరొకరు డేటా ఎంట్రీలో పనులు చేస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 22 మంది ఏఎన్‌ఎంలు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్నారు. వివిధ వ్యాధులతో బాధపడుతూ పీహెచ్‌సీకి వస్తున్న రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. మందులు లేకపోవడంతో మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి పంపిస్తున్నారు. సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న సీహెచ్‌సీకి వచ్చేందుకు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి అన్ని వసతులతో కూడిన భవనంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కొనసాగించి తమ ఇబ్బందులను తీర్చాలని రోగులు కోరుతున్నారు.

మందుల కోసం మండల కేంద్రానికి



- చింతల శ్రీనివాస్, స్థానికుడు

నాకు నీరసంగా ఉంటే మా గ్రామంలో ఉన్న ప్రభుత్వ దవాఖానాకు వెళ్లా. పరీక్షలు చేసిన వైద్యులు ఇక్కడ మందులు అందుబాటులో లేవని ఎల్లారెడ్డిపేటలోని సర్కారు పెద్దాసుపత్రికి పొమ్మన్నారు. మందుల కోసం మండల కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందవుతోంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



- స్రవంతి, పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యురాలు

బొప్పాపూర్‌లోని పల్లె దవాఖానాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం. రోగులకు అన్ని రకాల వైద్య సేవలను అందిస్తున్నాం. గదులు సరిపడక కొంత ఇబ్బందిగా మారుతోంది. పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలను తీర్చేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాం



- డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి

మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ కావడంతో బొప్పాపూర్‌లోని పల్లె దవాఖానలో కొనసాగిస్తున్నాం. పీహెచ్‌సీ భవన నిర్మాణం కోసం నివేదికలు పంపాం. బండలింగంపల్లితోపాటు వీర్నపల్లి పీహెచ్‌సీ భవనాలకు స్థలం పరిశీలించాం. నిధులు మంజూరవగానే ప్రారంభిస్తాం.

సీం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం



కోనరావుపేటలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేటలో..

ఎల్లారెడ్డిపేట, జూన్ 23: రైతులకు రుణమాఫీ తీర్మానంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు, రైతులు ఆదివారం సీం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. రైతులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. నాయకులు రామచంద్రం, మల్లారెడ్డి, నాగరాజు, లక్ష్మణ్, రవి, పర్శరాములు, శేఖర్, ప్రభాకర్, రాజయ్య, రాజం, మల్లేశం పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: రైతులకు రుణమాఫీ చారిత్రాత్మకమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్ అన్నారు. 2లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేసిన నేపథ్యంలో రూరల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో హన్మాజిపేట, ఫాజుల్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు చెన్నాడి శ్యామల గోవర్దన్‌రెడ్డి, రంగు వెంకటేశం, బొడ్డు నర్సవ్వరాములు, నాయకులు సామ తిరుపతిరెడ్డి, సంపస్వామి, సోయినేని కరుణాకర్, ప్రవీణ్, రొండిరాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని సెస్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో రైతుల రుణమాఫీకి ప్రభుత్వం సిద్ధమవగా సంతోషాన్ని వ్యక్తం చేస్తూ రైతులతో కలిసి కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి బ్యాంకుల చుట్టూ తిప్పిందని, రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీకి ఆమోదం తెలిపిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కచ్చకాయల ఎల్లయ్య చందనగిరి గోపాల్, గొట్టె రుక్మిణి, తాళ్లపల్లి ప్రభాకర్, మండల నాయకులు నందు గౌడ్, సదానందం, ఎంపీటీసీ చారి, మానుక సత్యం తదితరులు పాల్గొన్నారు.

పడిపోతున్నా.. పట్టించుకోరా?



ఒరిగిన విద్యుత్ స్తంభం

ఎల్లారెడ్డిపేట, జూన్ 23: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కొత్త బస్టాండు వెనుకల విద్యుత్ స్తంభం ఓ వైపునకు ఒరిగి ప్రమాదకరంగా మారింది. కరెంటు తీగలు నేలకు తాకుతున్నాయి. అటు వైపు వెళ్తే ప్రాణాలు గాలిలో కలిసిపోయేలా మారాయి. సెస్ కార్యాలయానికి సమీపంలోని గిద్దె చెరువు కట్టపై విద్యుత్ స్తంభం వంగిపోయి తీగలు నేలకు తాకుతున్నాయని, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలని, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నిధులు మళ్లించారని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్

సిరిసిల్ల టౌన్, జూన్ 23: మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్ 13వ వార్డు అభివృద్ధి పనులను అడ్డుకుంటూ కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని సిరిసిల్ల పట్టణం 13వ వార్డులో ఆదివారం కౌన్సిలర్ శైలుశ్రీకాంత్‌గౌడ్, స్థానిక యువకులు ఆరోపించారు. గతంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ వార్డు అభివృద్ధి పనులకు కొబ్బరి కాయలు కొట్టి ప్రారంభించారని, ఇప్పుడు వార్డు అభివృద్ధి పనుల నిధులను దారి మళ్లించారని, కొట్టిన కొబ్బరి కాయాలను తిరిగి తీసుకోవాలంటూ కొబ్బరి కాయలతో ఆదివారం రోడ్డుపై వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా 13వ వార్డు కౌన్సిలర్ శైలుశ్రీకాంత్‌గౌడ్ మాట్లాడారు. గతంలోనే 13వ వార్డు అభివృద్ధి పనుల కోసం రూ. 25 లక్షలు మంజూరవగా రూ. 19 లక్షల వరకు పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. మిగతా పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరితే 13వ వార్డుకు సంబంధించిన నిధులతో వేరే వార్డులో అభివృద్ధి పనులు చేశామంటూ చెప్పాడన్నారు. 13వ వార్డుకు మంజూరు చేసిన నిధులను ఇతర వార్డులకు మళ్లించి తమను కక్ష సాధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైన తమ వార్డు అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, యూసుబ్, ఎస్కే, షబీర్, ఎండీ అజ్మత్, షకీల్, రఫీక్, యువకులు పాల్గొన్నారు.

కూరగాయల పంటలకు బీమా సౌకర్యం కల్పించాలి

కొడిమ్యాల, జూన్ 23: అకాల వర్షాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలతో కూరగాయల పంటలు దెబ్బ తిన్నప్పుడు కూరగాయల బీమా సౌకర్యం కల్పించాలని పూడూర్ మాజీ సర్పంచ్ వెల్మల రాంరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూరగాయల పంటలపై ప్రభుత్వం రాయితీలను రద్దు చేయటంతో రైతులకు కూరగాయల సాగు ఖర్చులు పెరుగుతున్నాయన్నారు. కూరగాయల నిల్వచేయడానికి సౌకర్యాలు లేకపోవడం, రవాణాలో ఇబ్బందులతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. కూరగాయలను పండించే రైతు కష్టనష్టాలను ఓర్చుకుంటున్నారన్నారు. కూరగాయలను అమ్ముకుందామంటే ధరల్లో తీవ్ర వ్యత్యాసం, దళారీల దోపిడీతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ విస్తీర్ణంలో కూరగాయల సాగుతో సామాన్యులకు ధరలు అందుబాటులో ఉంటాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

10 శాతం సీట్లు పెంచాలి

కోనరావుపేట, జూన్ 23 : ఏకలవ్య గురుకుల పాఠశాలలో 10 శాతం సీట్లు పెంచాలని గిరిజన జిల్లా ఐక్యవేదిక అధ్యక్షుడు నరేష్ కోరారు. మండలంలోని మరిమడ్ల ఏకలవ్య గురుకుల పాఠశాలను ఆదివారం పరిశీలించారు. ఏకలవ్య గురుకుల పాఠశాలలో సీబీఎస్ సిలబస్ ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో పాఠశాల ఒకటే ఉండడంతో సీట్లు సరిపోవడం లేదన్నారు. గిరిజన ఐక్యవేదిక నాయకులు శ్రీనివాస్ నాయక్, కుమ్మరి దిలీప్, వెంకటేష్, జింక రాజేందర్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



విద్యుత్ తీగలు చూపిస్తున్న స్థానికుడు

కోనరావుపేట, జూన్ 23: కోనరావుపేట మండలంలోని కొలనూరులో వేలాడుతున్న విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. పంటలుసాగు చేస సమయంలో ఇబ్బందులు ఎదురవు తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. గ్రామం లోని సుద్దాల నరేష్ వ్యవసాయ భూమిలో నిలబడితే తాకే ఎత్తులో తీగలు వేలాడుతుండడంతో భయాందోళన చెందుతున్నాడు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నాడు. ఇప్పటికైనా స్పందించాలని, విద్యుత్ తీగలను సరిచేయాలని కోరుతున్నాడు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

కరీంనగర్ అర్బన్, జూన్ 23: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్లు కృషి చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం సమావేశమయ్యారు. ఇటీవల మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలెక్టరేట్‌లో మంత్రి సమీక్ష నిర్వహించి దృష్టికి వచ్చిన పెండింగ్ పనులు, సమస్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బల్దియాలో పెండింగ్ సమస్యలపై మరోసారి కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, స్థానిక నాయకులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కార్పొరేటర్లు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కార్పొరేటర్లు చెప్పిన సమస్యలపై మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో మంత్రి మాట్లాడి పనులు పెండింగ్ లేకుండా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మేయర్ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని, ప్రజల పక్షాన కార్పొరేటర్లు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సూచించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్పొరేషన్‌లో సీఎం అస్యూరెన్స్ కింద 133 కోట్ల పెండింగ్ పనులు, అవినీతిపై వచ్చిన ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ జరుగుతుందన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

వీర్నపల్లి, జూన్ 23 : వారం రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భూక్య లింబ్యా నాయక్ కుటుంబ సభ్యులను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. అనంతరం బాబాయి చెరువు తండాలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న బానోతు మమత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ గౌడ్, సద్ది లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు రాములు నాయక్, కాంతయ్య, గజన్ నాయక్, దేశరాజు కుమార్, హరిలాల్, సంతోష్ నాయక్, బొంగు తిరుపతి, నందగిరి శ్రీనివాస్, మదన్ ఉన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు లక్ష్మీపతి ఇటీవల మరణించగా బాధిత కుటుంబాన్ని సిరిసిల్ల నియోజక వర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు హమీద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, ఓరుగంటి నర్సింలు, రాజయ్య, నారాయణ, దేవయ్య తదితరులు ఉన్నారు.

వేములవాడ రూరల్: మండలంలోని హన్మాజిపేటలో మృతి చెందిన ఎల్లాల తిరుపతి కుటుంబాన్ని, మల్లారం ఎంపీటీసీ తిరుపతి తల్లి ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, నాయకులు ఏశ తిరుపతి, మల్లేశం, బాల్‌రెడ్డి, తిరుపతి, అంజయ్య, దేవరాజు తదితరులు ఉన్నారు.

భూ కబ్జాపై మహిళల ఫిర్యాదు

కథలాపూర్, జూన్ 23: మండలంలోని ఇప్పపల్లిలో మహిళా సంఘాలు కొనుగోలు చేసిన భూమిని ఓ వ్యక్తి కబ్జా చేశాడని పేర్కొంటూ ఆదివారం మహిళలు ఫిర్యాదు చేశారు. గడిచిన 2011లో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి మహిళలు కొనుగోలు చేశారు. అయితే ఆ భూమిలో నుంచి కొంత భూమిని ఓ వ్యక్తి ఆక్రమించారని సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఎస్సై నవీన్‌ను వివరణగా కోరగా ఈ విషయమై గ్రామంలో విచారణ చేపడతామని తెలిపారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న నాయకులు



వేములవాడలో..

సిరిసిల్ల రూరల్, జూన్ 23 : దేశసమైక్యత, సమగ్రత కోసం ప్రాణత్యాగం చేసిన డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అమరవీరుడని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెల్లి వేణుగోపాల్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలో ఆదివారం డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ బలిదాన్ సందర్భంగా బీజేపీ ఓబీసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మేర్గు శ్రీనివాస్, వెంగళ శ్రీనివాస్, మహిళా మోర్చా మాజీ అధ్యక్షురాలు తడుక కమల, ఓబీసీ పట్టణ ప్రధాన కార్యదర్శి అంకారపు రాజు, పోతు శ్రీనివాస్, పిస్కా వెంకటేశం, చలగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో ఆదివారం శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత ఆశయాలతో పార్టీని స్థాపించిన మహనీయుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అన్నారు. కార్యక్రమంలో జిల్లా దళితమోర్చా ప్రధానకార్యదర్శి మామిడి హరీష్, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి తిప్పారపు శ్రావణ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు వజ్జపల్లి శ్రీకాంత్, నాయకులు స్వామి, చిమ్మనగొట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ బలిదాన్ దివాస్‌ను వేములవాడ పట్టణంలో బీజేపీ నాయకులు ఆదివారం నిర్వహించారు. పార్టీ పట్టణ కార్యాలయంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు నాయకులు రాపెల్లి శ్రీధర్, నామాల శేఖర్, బిళ్ల కృష్ణహరి, నర్సయ్య ఉన్నారు.

కోనరావుపేట: డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను యువకులు కొనసాగించడానికి కృషి చేయాలని జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షుడు మిరియాల్‌కార్ బాలాజీ అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారంలో ఆదివారం శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు ఏక్ పెడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా రావి చెట్టును నాటారు.